బిట్స్ పిలానీ, బఫెలో యూనివర్సిటీల అవగాహన ఒప్పందం

జవహర్‌నగర్, నవంబర్ 8: బిట్స్ పిలానీ హైదరాబాద్, యూనివర్సిటీ ఆఫ్ బఫెలో(యూబీ) న్యూయార్క్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, గ్లోబల్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సాహించడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. శుక్రవారం బిట్స్‌పిలానీ క్యాంపస్‌లో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాంగోల్ రావు, యూనివర్సిటీ ఆఫ్ బఫెలో వైస్ ప్రెసిడెంట్ స్కాట్ వెబర్ రీసెర్చ్ ఇంజినీరింగ్‌లో అవగాహన ఒప్పంద ప్రతాలపై సంతకాలు చేశారు.కార్యక్రమంలో బిట్స్ పిలానీ సిబ్బంది పాల్గొన్నారు.

సదర్ సమ్మేళానికి రావాలని ఆహ్వానం

జవహర్‌నగర్, నవంబర్ 8: జవహర్‌నగర్ కార్పొరేషన్ బతుకమ్మ మైదానంలో ఈ నెల 10న నిర్వహించే సదర్ సమ్మేళానికి రావాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేటర్, ఉద్య స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ మేక లలితాయాదవ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహయాదవ్, ఉద్య ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కలినరీ ఆర్ట్స్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 8: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్షా ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు.

మల్కాజిగిరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- గౌతమ్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

నేరేడ్‌మెట్, నవంబర్ 8: మల్కాజిగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మిర్జాలగూడ దర్గా నుంచి ప్రేరణ టవర్స్ వరకు సుమారు రూ.17లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మేకల సునితారాము యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులను చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, డివిజన్ సీనియర్ నాయకుడు మేకల రాముయాదవ్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతమ్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునితారాముయాదవ్

ధోబీఘాట్ స్థలాన్ని రజకులకు అప్పగించండి..

– కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందించి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి : జ్యోతినగర్‌లోని ధోబీఘాట్ స్థలాన్ని రజకులకు అప్పగించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ.. స్థానిక రజకులు కులవృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తామని సర్కిల్ అధికారులు హామీ ఇవ్వడంతో ఇక్కడి ధోబీఘాట్ కూల్చివేతకు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రహరీ నిర్మాణం తర్వాత కొందరు స్థలం విషయమై వాగ్వాదానికి దిగారని అన్నారు. అంతేకాకుండా చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తొలగించారని కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ధోబీఘాట్ స్థలాన్ని రజకులకు అప్పగించాలని పేర్కొన్నారు.

భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత

- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి
- లక్ష్మీనగర్‌కాలనీలో బంగారు మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మేకల కావ్య

జవహర్‌నగర్, నవంబర్ 8: అమ్మవారి ఆశీస్సులతోనే సుఖసంతోషాలు కలుగుతాయని, బంగారు మైసమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని లక్ష్మీనగర్‌కాలనీలోని బంగారు మైసమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. భక్తిమార్గంలోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం బంగారు మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్లు సంగీతారాజశేఖర్, పల్లపు రవి, శారదామనోధర్‌రెడ్డి, జవహర్‌నగర్ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌చారి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, నాయకులు ప్రకాశ్, పరశురామ్, నర్సింహయాదవ్,మహేందర్‌యాదవ్, బాలస్వామి, నర్సింహ, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మందాయిపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనలు.. పాల్గొన్న ఎమ్మెల్యే

శామీర్‌పేట : తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని మందాయిపల్లిలో శుక్రవారం హనుమాన్ ఆలయ పునఃనిర్మాణ, విగ్రహ ప్రతిష్ఠ, గణపతి, పెద్దమ్మతల్లి, శివలింగం, నవగ్రహ, జంగ నాగుల ఆలయాల్లో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ వాణీవీరారెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించాలి

- చైర్మన్,అధికారులు లేకుండానే పనులు ప్రారంభించడం సరికాదు..

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పోచారం మున్సిపాలిటీ నాయకులు

ఘట్‌కేసర్,నవంబర్ 8 : కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించాలని, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు సమాచారం లేకుండానే రోడ్డు పనులు ప్రారంభించడం సరికాదని పోచారం బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం పోచారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి శేఖర్,కౌన్సిలర్ హరిప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు అక్రమ్ అలీ, నాయకుల బుచ్చిరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, శ్రీనివాస్, నర్సింహ, యూత్ నాయకుడు ప్రశాంత్ మాట్లాడారు. ఈనెల 7న పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ కొంతమంది నాయకులతో కలిసి ఎమ్మెల్యే, చైర్మన్,కమిషనర్ లేకుండానే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడం ప్రొటోకాల్‌కు విరుద్ధమన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ ప్రతిపక్ష నాయకులను కాదని ప్రొటోకాల్‌కు విరుద్ధంగా కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమంలా నిర్వహిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు.

ముంపు తలెత్తకుండా చర్యలు : కార్పొరేటర్

మల్కాజిగిరి, నవంబర్ 8: వరద ముంపు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శుక్రవారం ఎస్పీ నగర్‌లో రూ. 60 లక్షలతో చేపట్టిన నాలా కల్వర్టు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విజయ్‌కుమార్, శ్రీకాంత్, సుబ్బారావు, శంకర్, సులోచన, మధు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు

- రాష్ట్ర విజిలెన్స్ ఎస్పీ శశిధర్ రాజు

మాదారం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్పీ శశిధర్‌రాజు డీఎం సుగుణబాయి, డీసీవో వెంకట్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 8 : ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి నష్టం జరిగిన కఠిన చర్యలు తప్పవని స్టేట్ విజిలెన్స్ ఎస్పీ శశిధర్ రాజు హెచ్చరించారు. శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాదారం, ఎదులాబాద్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను విజిలెన్స్ ఎస్పీ శశిధర్ రాజు, డీఎం సుగుణబాయి, డీసీవో వెంకట్‌రెడ్డి అకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. కొనుగోలు కేంద్రం వద్ద రికార్డులు తనిఖీ చేసి ధాన్యం తూకాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు ఉంటాయని నిర్వాహకులను హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు ధాన్యం తూకం వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో జగదీశ్, ఇన్‌చార్జి చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

'రాంకీ' సహకారంతో బోర్లు, వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు

కీసర, నవంబర్ 8 : రాంకీ సంస్థ సహ కారంతో చీర్యాల్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోర్లు, రెండు వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో బోర్లు వేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. రాంకీ సంస్థ ఆర్థిక సాయం అందించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ రామిడి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు బాల్‌రాజ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయాదవ్, గౌరీశంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ బారిన పడితే బతుకు ఆగమే..

- యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీ సీతారామ్

సీఎంఆర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్పీ సీతారామ్, అధికారులు, విద్యార్థులు

మేడ్చల్, నవంబర్ 8 : డ్రగ్స్ బారిన పడితే యువత బతుకు ఆగమవుతుందని యాంటీ నార్కొటిక్స్ బ్యూరో సీతారామ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ విద్యాసంస్థల ఆడిటోరియంలో శుక్రవారం డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్ పేరుతో యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారు భవిష్యత్ ఉన్న యువకులు డ్రగ్స్‌కు బారిన పడి, జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి, సింథటిక్స్ డ్రగ్స్ వినియోగం పెరిగిపోతున్నదని, కొంతమంది సంపాదనే లక్ష్యంగా యువతకు డ్రగ్స్ అలవాటు చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు పూర్తిగా చదువుపై దృష్టి సారించి, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డీఎస్పీలు హరిశ్చంద్రరెడ్డి, సుబ్బారాంరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు శ్రీనివాస్‌రావు,గోపి,సత్యనారాయణ, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, సీఎంఆర్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ, డీన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ అమర్‌సింగ్, కార్పొరేటర్

బోడుప్పల్, నవంబర్ 8 : వయోవృద్ధులకు అండగా నిలుస్తామని, త్వరలోనే సీనియర్ సిటిజన్స్‌కు కమ్యూనిటీహాల్‌ను అందుబాటులోకి తెస్తామని పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ తెలిపారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్ని పురస్కరించుకుని చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ కొడె పోచయ్యగౌడ్‌తో కలిసి సీనియర్ సిటిజన్స్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. మరో మూడు నెలల్లో వృద్ధులకు అన్ని సదుపాయాలతో కూడిన కమ్యూనిటీ భవనాన్ని నిర్మించి ఇస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, మురళీకృష్ణ, భిక్షపతి, సూర్యనారాయణ, మనోహర్‌రెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీపీసీ రోడ్డులో పారిశుధ్య పనుల పరిశీలన

ఘట్‌కేసర్, నవంబర్ 8: పోచా రం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎన్‌టీపీసీ రోడ్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు రోడ్లపై చెత్తను వేయకుండా చెత్త బుట్టల్లోనే వేయాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రోడ్ల పై ఉన్న పిచ్చిమొక్కలు తొలగింపునకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ సాయిరెడ్డి, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వేదపాఠశాలలో కార్తిక పూజలు

రామంతాపూర్,నవంబర్ 8 : సనాతన వైదిక బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో రామంతాపూర్ వేదపాఠశాలలో కార్తిక మాసం పురస్కరించుకొని మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పాలపర్తి లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. కార్తికమాసంలో నెల రోజుల పాటు సంఘం సభ్యుల సహకారంతో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఖోఖో జాతీయ పోటీలకు ఎంపిక

శామీర్‌పేట, నవంబర్ 8 : తూంకుంట మున్సిపాలిటీలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సాయికుమార్ ఖోఖో జాతీయస్థాయి జూనియర్ పోటీలకు ఎంపిక య్యాడు. శుక్రవారం పాఠశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించారు. ఈ నెల 25 నుంచి ఉత్తరప్రదేశ్ అలీగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ట్రాస్మా ఉపాధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జంగారెడ్డి, పీఈటీ ప్రశాంత్‌రెడ్డి, రష్మిత, షబానా, విద్యార్థులు పాల్గొన్నారు.

జామ్ మసీదులో దుకాణాలు ప్రారంభం



శామీర్‌పేట, నవంబర్ 8 : తూంకుంట మున్సిపాలిటీ శామీర్‌పేట జామ్ మసీదులో నూతనంగా నిర్మించిన షాపులను టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అజ్మత్ ఉల్లా హుస్సేన్, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ జహంగీర్,రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ నర్సింలుయాదవ్, షఫిఉద్దీన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ గౌడ్, జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కిశోర్‌యాదవ్,మహేందర్‌యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుద్దీన్, చాంద్‌పాషా, అశోక్, సాజిద్ పాల్గొన్నారు.

ఆటో తస్కరించిన యువకుడు అరెస్టు

మల్కాజిగిరి, నవంబర్ 8: ఆటోను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న యువకుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. డీఐ శ్రీశైలం కథనం ప్రకారం... ఫుట్‌పాత్‌లపై నివసించే బెగల శేఖర్ గతంలో నేరేడ్‌మెట్, మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలుచేసి జైలుకు వెళ్లి నవంబర్ 2న విడుదలయ్యాడు. గురువారం అర్ధరాతి మల్కాజిగిరి ప్రభుత్వ పాఠశాల వద్ద పార్కు చేసిన ఆటో కనిపించక పోవడంతో ఆటో డ్రైవర్ పోలీసుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో వాహనాలను తనిఖీలు చేస్తూ ఓ ఆటోను ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించారు. తాను ఆటోను చోరీ చేసినట్లు బెగల శేఖర్ అంగీకరించాడు. నిందితుడని రిమాండ్ చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మేస్త్రీ అదృశ్యం

అదృశ్యమైన మేస్త్రీ ఆనంద్ (ఫైల్)

మల్కాజిగిరి, నవంబర్ 8: తాపీ మేస్త్రీ అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ కథనం ప్రకా రం... హిల్‌టాప్ కాలనీకి చెందిన ఆనంద్(31) తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. గత నెల 21న ఉదయం పనికి వెళ్లి రాత్రి వరకు ఇంటికి రాలేదు. అంతటా వెతికినా ఆచూకీ దొరకపోవడంతో ఆనంద్ భార్య సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న శామీర్‌పేట ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

శామీర్‌పేట, నవంబర్ 8 : శామీర్‌పేట ఐటీఐలో ఈ నెల 11న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లలిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా జరుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌బీఎల్, బీఈఎల్, ఎన్ఎన్‌సీ, ఫెనెస్టా తదితర కంపెనీలు మేళాలో పాల్గొంటాయని, ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్ http.siapprenticeship.india.org.in అనే సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు..

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్

మేడ్చల్, నవంబర్ 8 : డిగ్రీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు బకాయి ఉందని సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టవద్దని కళాశాలల యాజమాన్యాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాలతో 2024–25 విద్యా సంవత్సరానికి ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల ఆన్‌లైన్ నమోదుపై కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు శుక్రవారం కలెక్టరేట్‌లో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని సర్టిఫికెట్ ఇవ్వకపోతే ఉన్నత చదువులు, ప్లేస్‌మెంట్‌కు అవరోధం ఏర్పడుతుందన్నారు. ఉపకార వేతనాలు కొంత ఆలస్యంగానైనా కళాశాల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. ప్రతి కళాశాలలో ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహించేందుకు బాధ్యత గల సిబ్బందిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. ఎలాంటి తప్పులు జరగకుండా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కొత్తగా నమోదు చేసుకునే విద్యార్థులు, రెన్యూవల్ దరఖాస్తులను కూడా ఈ సంవత్సరానికి ఆన్‌లైన్‌లోనే పంపాలన్నారు. విద్యార్థుల ఆధార్ నంబర్లను బ్యాంక్ ఖాతాలతో అనుసంధానించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజీజీ ప్రతినిధి వినయ్ కృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో ఉపకార వేతనాల నమోదుపై అవగాహన కల్పించారు.

కన్నులపండువగా ఉత్తర భారతీయుల ఛత్ పూజలు

- పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

అత్వెల్లి పెద్ద చెరువు వద్ద చత్ పూజల్లో చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్, నవంబర్ 8 : మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి గ్రామ పెద్ద చెరువు వద్ద జన్ సేవాసంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్తర భారతీయులు శుక్రవారం ఛత్ పూజను కన్నుల పండువగా నిర్వహించారు. చెరువు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని చెరువు సమీపంలో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఉత్తర భారత మహిళల భక్తిభావం గొప్పదన్నారు. వారి కోర్కెలను తీర్చాలని పరమేశ్వరుడికి కోరుకున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో జన్ సేవా సంఘ్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాండే, కపిరాజుసింగ్, సుజిత్‌సింగ్, సంతోష్ పాడే, అశోక్ ప్రసాద్, దినేష్, రజాక్, అజయ్, శోభారాణి, బోలాసింగ్, నాగమణి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి : ఎంపీ

శామీర్‌పేట : ఆహ్లాదకర వాతావరణంలో పండుగలను కుటుంబ సమేతంగా జరుపుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శామీర్‌పేట చెరువులో ఛత్ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంపీ ఈటల పాల్గొని గంగాతర్పణం వదిలారు. ఉత్తర భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బీ.చంద్రశేఖర్‌యాదవ్, బీజేపీ నేతలు, ఉత్తర భారతీయులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో...

ఉప్పల్ చెరువు వద్ద పూజలు చేస్తున్న బీహారీలు

ఉప్పల్ : బీహార్ అసోసియేషన్ ఉప్పల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఛత్ పూజ నిర్వహించారు. ఉప్పల్ చెరువు ప్రాంతంలో బీహారీలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాస్‌కుమార్, ఉపాధ్యక్షుడు రవిశంకర్ సింగ్, అరవింద్ సింగ్ యాదవ్, విక్రమ్‌సింగ్, దిలీప్‌యాదవ్, సూర్య శేఖర్‌సింగ్(శేఖర్ హౌజరి), రిషిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో చోరీలు.. చోద్యం చూస్తున్న పోలీసులు

- పని చేయని సీసీ కెమెరాలు
- తాళం వేసిన ఇండ్లే దొంగల టార్గెట్



సీసీ కెమెరాల్లో నమోదైన దొంగలు దృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 8: తాళం వేసిన ఇండ్లను టార్గెట్‌గా చేసుకున్న దొంగలు ఎన్ఎఫ్‌సీనగర్‌లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లో గత కొంత కాలంగా దొంగలు యథేచ్ఛగా చోరీలు చేస్తున్నా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకుండా మొరాయించినా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో దుండగులు యథేచ్ఛగా తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల దొంగతనాలు ఎక్కువ కావటంతో కాలనీ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బీ–2, సీ–2 కాలనీలతో పాటు బీ–1 కాలనీల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. ఎన్ఎఫ్‌సీనగర్ పరిధి లక్ష్మీనగర్‌లో ఈ నెల 6న మేకల రమేశ్ తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా తాళం పగులగొట్టి 1.5 తులాల బంగారు నగలు, 30 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. గురువారం తెల్లవారు జామున బీ–1 కాలనీలో మరో ఇంట్లో నగలు, నగదు చోరీకి గురయ్యాయి. బీ–1కాలనీలో ద్విచక్రవాహనాన్ని దొంగిలించిన అనంతరం మరికొద్ది దూరంలో తాళం వేసి ఉన్న బ్రహ్మతేజ ఇంటి కిచెన్ చిమ్నీ రంధ్రం లో నుంచి లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న 6 తులాల బంగారు ఆభరణాలు, వెండి వినాయక విగ్రహాలు, రూ.20 వేల నగదును అపహరించుకుపోయారు. ఇంట్లోని సీసీ కెమెరాలు, డీవీఆర్, హార్డ్‌డిస్క్ లను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. అనంతరం బైక్‌పై పరారైన దృశ్యాలు ఎదురింట్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఇద్దరు యువకులు దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీని పెంచి కాలనీల్లో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా దీపోత్సవం

కీసర, నవంబర్ 8; కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దీపోత్సవ వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చైర్మన్ నాగలింగంశర్మ, ఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారికి ప్రమిదలు, నూనె, వత్తులు, పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్టు, ప్రసాదం పంపిణీ చేశారు.

ఉప్పల్ మహంకాళి ఆలయాన్ని సందర్శించిన అధికారులు



ఉప్పల్,నవంబర్ 8: ఉప్పల్ ప్రధాన రహదారిపై ఉన్న మహంకాళి ఆలయాన్ని శుక్రవారం ఎండోమెంట్ అధికారులు సందర్శించారు. ఆలయా న్ని ఎండోమెంట్ విభాగంలో విలీనం చేసే అంశాలపై అర్చకులు, ఆలయ కమిటీ వారితో చర్చించారు. ఆలయానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. కాగా ఆలయ నిర్వాహకులపై ఆరోపణలు రావడంతోనే అధికారులు వచ్చినట్లు పలువురు భావిస్తున్నారు.

శామీర్‌పేటలో నాకాబందీ

శామీర్‌పేట, నవంబర్ 8 : శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు నాకాబందీ నిర్వహించారు. వాహనాల తనిఖీలో 49 ద్విచక్ర వాహనాలు, 11 ఆటోలు, 9 కార్లకు సరియైన పత్రాలు లేనట్టు గుర్తించారు. వాహన యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్సైలు హారిక, దశరథ్, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.